# ఆదివారంనాడు...

జి. పి. దేవకి

★

"ఏమేవ్...ఇకలే చాలునిద్ర"

"....."

"అయిదున్నర గంట లయింది! అబ్బ నీకు మరీ మొద్దునిద్దర."

"........ .."

"కుంభకర్ణుడికి జాబు కొంచం మిగిల్చి మధ్యాహ్నం లభించు చవటమ్మా! రానురాను మీయిదరికీ యింటిమెసీ జాస్తి అయిపోతోంది..."

"..........."

"యేం నామాటలు చెవులోదూరి బుర్రలో యెక్కలేదేం?"

"....  .. ..."

"ఉరాంగు టాంగ్ లాగ అరుస్తున్నాడు_ 'పాలో' అని పాలవాడు- చెవులకి కర్ణకుండలాలు కూడలేవే వినబడదనే దానికి నీవు నాకే దాపరించాలా చవటమ్మా నీ "పిల్లి" మొహం చూపించకుండా అలాలేచి నడకతియ్యి దొడ్లోకి

"... ... ..."

"ఇవాళ అదీ సోమవారం జ్ఞాపకం చెయ్యి- అ. కాదు .. కాదు .. సోమవారం నాడేకదూ ఆ సేటు పిలకాయ 5 వీశెలు చక్కగ యిస్తానన్నాడు, యింకా తగలెయ్యలేదు- మంగళవారంకూడా వచ్చింది... చాకలి సన్నాసి యీ మధ్యాహ్నంవచ్చి దాపరిస్తాడేమో అ... నిన్నే కదూ మంగళవారం అయితే యివాళ బుధవారం అయుండాలి. . ఏమో రానురాను నీకుంగ మతి "యెడ్మైర్" చేయనుచేయను- నా మతి గ్లోబ్ లాగ తిరిగిపోతోంది-"

"... .. ..."

"అప్పుడే దిగబడింది యిల్లుచిమ్మే లచ్చి రాత్రంతా జాగ్రఫీ మేప్ డ్రాయింగ్ పుస్తకాలు దిద్దిపెట్టా చిత్తుకాయితాలని తగలబెట్ట పోతుంది- లేచిచెప్పవే... దాని పాచిమూతిలోనే వాలను తెయ్యి మరి..."

"... ... . "

"ససేమిరా! గంట 6 అయింది. అనంతశయనం నుంచి లేవవేమే? యివాళ శుక్రవారమేమో! అయితే యివాళస్కూల్లో యిన్స్పెక్షన్ ఎనిమిదన్నర కల్లా యిన్స్పెక్టర్ వచ్చి తేల్తాడు- మరిలే ... ఫొయ్యరాదే యిమరి? ఇంత వాగినాకాని నిద్రకు 'యింటరెస్ట్' కాలేదే! చాకలి సన్నాసిగాడు యింకారాలే! నాకుకోటూ తలపాగా, యెలామరి? అగీయివాళ బ్యాంకుకు వెళ్ళి రూపాయలు తెచ్చుకొని జోళ్లుకొనుక్కొని స్కూలుకెళ్ళాలి! యెలామరి? నీతో వాగివాగి నా 'బ్రెయిన్, క్లాట్' అయిపోతోంది"

". ... ..."

"అయ్యో! నిన్నరాత్రి 'మేప్'తోని పేర్లంతా బట్టిపెట్టా ..మరచి పోయాకూడా! చిటికాక సరస్సు ఉత్తర అమెరికాలో వుందోమరి దక్షిణ అమెరికాలో వుందో, యేడిశావ్! నీబదులు ఆ గోడే వినాలి"

"...  "

"అయ్యో నామతిఅడుగంట అప్పుడే చెప్పవే గాదేమి? అసలు యివాళ ఆదివారం- స్కూలు లేదు- పాడుబ్యాంకు లేదు! యేడిసినట్టే వుంది! అప్పుడే చెప్పలా నామతి 'స్పియర్ బ్రెయిన్' వుంటే యెంతో బావుణ్ణు-

".... .."

"భార్యామణీ! అరెరె! అప్పుడే లేచావ్— యింకా 7 గంటలు కొట్టలా! నిద్రోవు యింకొంచం అసలు యివాళ ఆదివారమని నా 'మైండు'కు రాలే... లేకపోతే అరె నేవెళ్తా పాలుతీసుకోడానికి నిద్రోవు- మరి యింక నీనిద్రతో "ఇంటర్ ఫియర్' చేసుకోనూ..."